వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 30 సెప్టెంబర్ 2024


## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన 6 మంది విద్యార్థులు

**కడప కార్పొరేషన్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**



వైఎస్ఆర్ కడప జిల్లా స్పోర్ట్స్ స్కూలులో ఆదివారం జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు గంగనపల్లె పాఠశాల విద్యార్థులు 6 మంది ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో హేమర్‌త్రోలో మదన్‌మోహన్‌రెడ్డి ప్రథమ, సన్నీకుమార్ రాజు ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో హేమర్‌త్రోలో రవి త్రేణి ప్రథమ, రెహానా ద్వితీయ స్థానంలో నిలిచారు. ఫోల్ వాల్ట్‌లో సుహానా ఫౌజియా ప్రథమ స్థానం, రెహానా ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అక్టోబర్ నెలలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలోఎంపికైన వారు పాల్గొంటారని చెప్పారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సావిత్రిదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## సెప్టెంబరు 30న రాష్ట్ర రవాణా శాఖామంత్రి మండిపల్లి రాక

**రాయచోటి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**



రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి రావడం జరుగుతుంది. మంత్రివర్యులు సోమవారం ఉదయం 7.45 గంటలకు తిరుపతి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 10 గంటలకు రాయచోటిలోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం మంత్రి 11 గంటలకు మున్సిపల్ సమావేశంలో పాల్గొనడం జరుగుతుంది.

# భారత్‌ను విశ్వ గురువుగా నిలపడమే నరేంద్ర మోడి లక్ష్యం

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్






**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:**

భారత్‌ను విశ్వ గురువుగా నిలపడమే ప్రధానమంత్రి నరేంద్ర మోడి లక్ష్యమని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్ అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ తరపున ఎన్డీఏ కూటమిలో భాగంగా ధర్మవరం నుండి పోటీ చేసి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి ప్రొద్దుటూరుకు విచ్చేసిన సంధర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీఫ్‌రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి అరకటవేముల హరినారాయణ, బిజెపి పట్టణ అధ్యక్షులు వంకదార నరేంద్ర రావు ఆధ్వర్యంలో సత్యకుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వాసవి సర్కిల్ నుండి యర్రగుంట్ల బైపాస్ రోడ్డు, మైదుకూరు రోడ్డు, పుట్టపర్తి సర్కిల్ మీదుగా టీటీడీ కళ్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన బిజెపి నాయకుల కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు వేదికగా విజయాన్ని అందించిన ధర్మవరం ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు మంత్రిగా అవకాశం ఇచ్చేందుకు కృషి చేసిన ప్రధాని నరేంద్ర మోడి, ఆంధ్రప్రదేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ప్రత్యేక ధణ్యావాదాతు తెలిపారు. ప్రొద్దుటూరులో సామాన్య లారీ డ్రైవర్ కుమారుడిగా జన్మించిన తాను గత 25సంవత్సరాల క్రితం సామాన్య కార్యకర్తగా బిజెపిలో చేరానని, పార్టీ సిద్ధాతం మేరకు బిజెపిలో పనిచేశారని, పార్టీ ఆదేశించిన ప్రతి పనిని సమర్ధవంతంగా పూర్తి చేశానని వివరించారు. బీజెపిలో నిబద్ధతతో పనిచేసే వారికి సరైన గౌరవం లభిస్తుందనేందుకు తాను ఉదాహరణ అని స్పష్టం చేశారు. పేదల జీవితాలో వెలుగులు నింపాలని లక్ష్యంతో నరేంద్ర మోడి పనిచేస్తున్నారని, భారత్ విశ్వ గురువుగా మోది పాలనలో ఎదుగుతోందని, భారతదేశంలో 3 సార్లు అధికారంలోకి రావడం, మధ్యప్రదేష్‌లో వరుసగా 5సార్లు, గుజరాత్‌లో వరుసగా 7సార్లు గెలుపొందడం భారతీయ జనతా పార్టీ పట్ల ప్రజల విశ్వాసానికి నిదర్శనం అన్నారు. ఆంధ్రప్రదేష్‌లో నిరంకుశ పాలన చేసిన వైసీపీకి 151సీట్ల నుండి ప్రతిపక్షం కూడ లేకుండా 11సీట్లకే పరిమితం చేశారని గుర్తు చేశారు. భారతీయ జనతా పార్టీతో జత కట్టిన టీడీపీ, జనసేన కూటమికి 164 సీట్లు ఇచ్చి ప్రజలకు ఎన్డీఏ కూటమిపై విశ్వాసాన్ని తెలిపితే కూటమి ప్రభుత్వం 100రోజులలోనే ఇది మంచి ప్రభుత్వంగా అనిపించుకుందని, వాలంటీర్లు లేకుండా సమర్ధవంతంగా పింఛన్ల పంపిణీ, మేనిఫెస్టోలో తెలిపిన విధంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, అన్నా క్యాంటీన్‌ల పుణ: ప్రారంభం చేసి కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే మంచి జరుగుతుందని నిరూపించారని వివరించారు. పోలవరం నిర్మాణానికి 12500కోట్లు విడుదల, విశాఖ, విజయవాడ మెట్రోకు నిధులు, అమరావతి నిర్మాణానికి 15000కోట్ల నిధులు ఇచ్చి ఏపీ అభివృద్ధికి సహకరిస్తోందని తెలిపారు. గత పాలనలో రహదారులు మరియు ఒక్క ఫ్యాక్టరీకీ లేదని, కెసి స్థిరీకరణ విస్మరించారని, అన్నమయ్య ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. జగన్ సొంత జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కూడ పూర్తి చేయలేదని, తన హయాంలో కొప్పర్తి, కాళహస్తిలో పారిశ్రామికీకరణ చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని వివరింఆరు. రాష్ట్రంలో బీజెపికి విస్తృత పరచాల్సిన అవాకశాలు ఉందని స్పష్టం చేశారు. అనంతరం ప్రొద్దుటూరు శివాలయం నుండి రాజీవ్ సర్కిల్, విజయకుమార్ సర్కిల్, టిబి రోడ్డు, చౌటపల్లి మీదుగా రాయల్ కౌంటీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజేఎంఎం రాష్ట్ర కోశాధికారి సి.వి జయలక్ష్మి, బిజెపి జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కె. ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, కార్యదర్శి అరకటవేముల హరినారాయణ, నాయకులు ఎల్లారెడ్డి, పుప్పాల శ్రీనాధ రెడ్డి, బొమ్మన సుబ్బరాయుడు, గీతా మాధురి, అరకటవేముల పృద్వీనారాయణ, బిజెపి ప్రొద్దుటూరు పట్టణాధ్యక్షులు నరేంద్ర రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, సత్యకుమార్ మిత్రులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాలకొండల జలపాతలలో పిల్లలతో కలిసి సేదతీరుతున్న కడప జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**రాయచోటి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**



ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. అక్కడ పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

## కేఎస్ఆర్ఎమ్ విధ్యార్థులకు అవగాహన సదస్సు



**కడప ప్రభాతవార్త, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:**

కెయస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్మెంట్ బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులతో అంతర్దృష్టి అవగాహనతో పరస్పర ముఖా ముఖి నిర్వహించారు. ఇందులో భాగంగా కాలేజ్ ప్లేస్‌మెంట్ ఇంచార్జీ రాయపాటి నాగరాజు మాట్లాడుతూ 100 ప్లేస్మెంట్ మరియు ఉద్యోగ కల్పన కోసం కావల్సిన టెక్నికల్ నాలెడ్జ్ అండ్ ట్రైనింగ్, హైయెస్ట్ ప్యాకేజీ మరియు వివరాల గురించి వివరణ ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ టెక్నికల్ నాలెడ్జ్ అండ్ ట్రైనింగ్ కోసం కావల్సిన అన్ని వసతులను కల్పిస్తూ పోటికి కావాల్సిన విర్చ్యుయల్ ఇంటర్వ్యూస్ మరియు మాక్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. కందుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విధ్యార్థిని కమ్యూనికేటింగ్, ఫైనాన్షియల్‌ఫ్రీడమ్, లక్ష్యాలను చేధించే సామర్థ్యం, అంచచలమైన మద్ధతును అందించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. విద్యలో తల్లిదండ్రుల ప్రమేయం యొక్క ప్రాముఖ్యత విద్యావేత్తలచే విస్తృత్తంగా గుర్తింపబడింది. పిల్లలకు మొదటి ఉపాధ్యాయులుగా తల్లిదండ్రులదే కీలకపాత్ర. ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్, బావోద్వేగ అభివృద్ధి, హోలిస్టిక్ గ్రోత్ కోసం సహకరించాలని అన్నారు. ఇంటరాక్టిర్ లెర్నింగ్ యాక్టివిటీస్, రియల్ టైమ్ మానిటరింగ్ పరస్పరంగా ఉంటే విధ్యార్థిని, విధ్యార్థులు అభివృద్ధి త్వరితగతిన సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వివిఎస్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శ్రీ ప్రేమ్‌కుమార్, హెచ్అండ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ నరేష్‌కుమార్ రెడ్డి, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలతో పాటు

## తమకు ప్రాధాన్యత కల్పించాలి

**కడప డిస్టిక్ ఎకగ్నైజేడ్ అనియటేడ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణా రెడ్డి**



**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించాలని కడప డిస్టిక్ రికగ్నైసేడ్ అనియేటెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక రవీంద్రా హైస్కూల్ నందు కడప, అన్నమయ్య జిల్లాల ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం కార్యనిర్వాహక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సంధభ్బంగా ఆయన మాట్లాడుతూ భవణానికి ఎన్సిసి, ఫైర్ వంటి అన్ని అనుమతులను ఒకే సారి ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల గుర్తింపును 8 ఏళ్లకు బదులు 10ఏళ్లకు పెంచాలని, వాహణాల ఇన్సూరెన్స్ ప్రీమియంను తగ్గించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ట్రిపుల్ ఐటీ ఎంపికలో ప్రైవేట్ పాఠశాలల విధ్యార్థుల పట్ల వివక్ష చూపడం తగదని, విద్యా రంగానికి సంబంధించి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న ప్రైవేటు విద్యా సంస్థల సంఘాలతో చర్చించాలని కోరారు. సెలవుల విశయంలో ప్రభుత్వం సరళతరంగా వ్యవహరించాలని, ప్రైవేటు విద్యా సంస్థలతో చర్చింకుండా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. బడ్జెట్ పాఠశాలలను విధ్యార్థి, కుల సంఘాల నుంచి రక్షణ కల్పించాలని, ఈ పాఠశాలలకు బ్యాంకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. బడ్జెట్ పాఠశాలలను, కార్పొరేట్ పాఠశాలలో పోల్చుకొని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోరాదని, తల్లికి వందనం పథకంను త్వరగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్మా జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్బారెడ్డి, పట్టణాధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి రాజారాం, మదనపల్లె పట్టణాధ్యక్షుడు లక్ష్మి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ రెడ్డి, చక్రపాణి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ఘన స్వాగతం

**ముద్దనూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:**

స్థానిక ముద్దనూరు నాలుగు రోడ్ల కూడలి నందు బిజెపి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరం నుంచి ముద్దనూరు మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్తుండగా ముద్దనూరు మండల బిజెపి నాయకులు కటికరెడ్డి మధుసూధన్ రెడ్డి నాలుగు రోడ్ల కూడలి నందు ఆదివారం నాడు క్రేన్ సహాయంతో భారీ గజమాల వేసి బాణాసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. మంత్రి బిజెపి నేతలను ఆత్మీయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు రాజుల సురేంద్రనాథ్ రెడ్డి, యువ నాయకుడు కటికరెడ్డి గుణమంత రెడ్డి, చెన్నారెడ్డి పల్లె రాజశేఖర్ యాదవ్, కాటమయ్య, తులసయ్య, బదుగు రాజు కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



### అమరావతి పోలవరంతో పాటు

## రాయలసీమకు నిధులు కేటాయించాలి

**రాయలసీమ విద్యావంతులు వేదిక రాష్ట్ర మహాసభల్లో బొజ్జ దశరధరామి రెడ్డి**



**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:**

అమరావతి, పోలవరం అభివృద్ధి మాత్రమే కాకుండా రాయలసీమ అభివృద్ధికి కేంద్రంలో నిధులు సాధించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాయలసీమ విద్యావంతుల వేదిక నాలుగవ రాష్ట్ర మహాసభలు ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూల్‌లోని మహిళా శక్తి భవన్‌లో విజయవంతంగా ముగిశాయి. రాష్ట్రంలో 44% భూములకు నీటి ప్రాజెక్టులు ఉంటే రాయలసీమలో కేవలం తొమ్మిది శాతం భూములకు మాత్రమే ప్రాజెక్టులు కట్టారన్నారు. చంద్రబాబు నాయుడుకు అమరావతి మీద ఉన్న పట్టుదల రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ఉండాలన్నారు. రాయలసీమ అభివృద్ధి కోసం రాజకీయాల పక్కన పెట్టి ఇక్కడ ఎమ్మెల్యేలు, ఎంపీలు సీమ ఉద్యమాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. మొదటి సెషన్లో విభజన హామీలు అమలు తీరుపై డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ నిజమైన మానవతా ఉద్యమం ఏదైనా ఉందంటే అది రాయలసీమ నీళ్ల ఉద్యమం అన్నారు. కేంద్రం చట్టబద్ధంగా చేసిన విభజన చట్టంలో రాయలసీమకు రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీ సెయిల్ ఆధ్వర్యంలోని ఉక్కు ఫ్యాక్టరీ గురించి మాట్లాడకుండా రాయలసీమ పాలకవర్గాలు వారి ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా ఉద్యమం తెరమీదకి తెచ్చి రాయలసీమ ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. పదేళ్ల రాయలసీమ ఉద్యమం భవిష్యత్తు కర్తవ్యాలపై ఎస్.రవికుమార్ మాట్లాడుతూ విభజన అనంతరం రాయలసీమ 10ఏళ్ల కాలంలో గతంలో ఎన్నడూ చేయనంత విసృతంగా రాయలసీమ డిమాండ్లపై ఉద్యమాలు జరిగాయన్నారు. ఈ ఉద్యమాలన్ని చాలా వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాగుతున్న ఉద్యమం నేడు రాయలసీమకు దశ దిశను చూపుతున్నది అన్నారు. ఈ సభల్లో రాయలసీమ కళాకారులు సీమ సమస్యలపై పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర కో కన్వీనర్ భాస్కర్ రెడ్డి, అనంతపురం కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, కర్నూలు కన్వీనర్ రత్నం, ఏసోబు, కడప కన్వీనర్ మహమూద్‌లతో పాటు పాణి, వరలక్ష్మి, పద్మ, లక్ష్మిదేవి, రమణ, శ్రీనివాసులు రెడ్డి, హరితలు పాల్గొన్నారు.

## అదుపు తప్పి టిప్పర్ బోల్తా

**ముద్దనూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:**

ముద్దనూరు మండలంలోని నల్లబల్లె రహదారిపై ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం..ముద్దనూరు నుంచి తాడిపత్రి బైపాస్ పనుల కొరకు కంకర లోడ్‌తో వెళ్తున్న ఓ టిప్పర్ రాత్రి 2:30 గంటల సమయంలో అదుపు తప్పి పంట పొలాల్లో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఒకే సారి పదుల సంఖ్యలో టిప్పర్లు వెళ్తుండగా వెనుక టిప్పర్లు దారిచ్చే ప్రయత్నంలో ప్రమాదం జరిగిందని తెలిపారు.



### జన హృదయాలకు

## ప్రభుత్వాల తోడ్పాటు అవసరం

**డాక్టర్ పాతకోట శ్రీనాధ రెడ్డి**

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:**



ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29వ తేదిన ప్రపంచ హృదయ దినోత్సవం(వరల్డ్ హార్ట్ డే) జరుపుకుంటున్నాం. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనం వల్ల యువతలో కూడ గుండె జబ్బులు వస్తున్నాయి. 2024 సంవత్సరం వరల్డ్ హార్ట్ డే థీమ్‌ని వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ వారి నిర్దేశప్రకారం ప్రజలు వారి వారి హృదయాలను జాగ్రత్తగా చూసుకోవలసిన ఆవసరాన్ని యూవత్ ప్రపంచ ప్రజలు, ప్రభుత్వాలు, నాయకులు గుర్తు ఎరగాలని తదనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అనేది శరీరానికి ఒక దివ్య ఔషధం. వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి 30 నిమిషాల శారీరక శ్రమను ప్రతిరోజు చేయడం ద్వారా శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా ఊబకాయం, రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది, జంక్ ఫుడ్, చక్కెర, మాంసాహారం, పాల ఉత్పత్తులు, పామాయిల్ అధిక కేలరీల ఆహారాన్ని నివారించుకొని వీటికి బదులుగా ఆహారంలో పీచు పదార్థాలు, వాల్‌నట్స్, సోయాబీన్, అవిసెగింజలు, పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోవడంతో పాటు ప్రతి ఒక్కరు కనీసం ఏడు నుంచి 8 గంటలు నిద్ర తీసుకోవాలి. ఒత్తిడిని తగ్గించడానికి యోగా, ధ్యానం, ఎంతో ఉపకరిస్తాయి. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం ఉన్న వారు 40 సంవత్సరాల వయస్సు దాటిన వారు, కుటుంబంలో గుండె జబ్బుల నేపథ్యం ఉన్న వారు క్రమం తప్పకుండా గుండెకి సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం ఆరోగ్య రిత్యా శ్రేయస్కరం అన్నారు. ధూమపాణం, పొగాకు నమలడం వల్ల యువతలో హార్ట్ అటాక్ వచ్చే అవకాశం ఉండడం వల్ల ప్రజలు ఈ వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన అన్నారు.

## మన ఇల్లు మన గౌరవం



పెనగలూరు,సెప్టంబర్ 29,ప్రభాతవవార్త :
మండలంలోని ఎన్టీఆర్ కాలనీలో ఎమ్మెల్యే ఆరవ శ్రీదర్ ఆదేశాల మేరకు మన ఇళ్లు - మన గౌరవం అనే కార్యక్రమమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ లబ్దిదారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ,హౌసింగ్ ఏఈ, పంచాయితీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మరియు అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి నాగినేని రాంప్రసాద్ నాయుడు, సీనియర్ నాయకులు పతకమూరి బాబు నాయుడు, మాజీ తెలుగు యువత అధ్యక్షుడు హరి తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజి నిర్మించారు.. హాస్టల్ నిర్మాణం జరగలేదు

- మెడికల్ కాలేజి సీట్లపై మాపై నిందలు - వైద్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్

పులివెందుల, సెప్టెంబరు 29, ప్రభాతవార్త ః
పులివెందుల మెడికల్ కాలేజి సీట్లపై మాపై నిందలు పోతున్నారని, వైఎస్ఆర్‌సీపీ పాలనలో మెడికల్ కాలేజి నిర్మించారు తప్ప హాస్టల్ నిర్మించలేదన్నారు. అందువల్లనే కాలేజిని ప్రారంభించడానికి వీలు కాలేదని ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం పులివెందులకు వచ్చిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శశిభూషణ్‌రెడ్డి నివాసానికి మంత్రి చేరుకుని అక్కడ మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని అంటున్నారని, ఎక్కడ చూసినా ప్రైమరీ హెల్త్ కేర్ కేంద్రాలు అధ్వాన పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఎక్కడా కూడా సరైన వైద్యులు లేరని, నర్సింగ్ సిబ్బంది లేరన్నారు. దొడ్డిదారిన అనుమతులు తీసుకువచ్చి మెడికల్ కళాశాలలు నిర్మించారని ఆయన ఆరోపించారు. రాజమండ్రిలో 95 మంది స్పెషల్ బోధనా సిబ్బందికి కేవలం ఏడు మంది మాత్రమే ఉన్నారంటే ఏ మాత్రం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారో అర్థంచేసుకోవచ్చన్నారు. ఏపీలో 100రోజుల పాలన ఘనంగా పూర్తిచేసుకోవడం అందుకు ప్రజలు కూడా సంతోషంగా ఉన్నారనేందుకు దారి పొడవునా ఘన స్వాగతం పలకడమే నిదర్శనం అన్నారు.

**- లింగాల వైద్యుడిపై చర్యలు తీసుకోండి :**
లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ కల్యాణ్‌పై చర్యలు తీసకోవాలని లింగాల ప్రజలు మంత్రికి ఫిర్యాదు చేశారు. పులివెందుల పర్యటనకు వస్తున్న మంత్రికి లింగాలలో డాక్టర్ కల్యాణ్ విధులు సక్రమంగా నిర్వహించరని, ఆసుపత్రికి వచ్చిన రోగులకు సరైన వైద్యం చేయడమని ప్రజలు మంత్రికి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా రోగులను దూరంగా ఉంచుతారని, రోజుకు 100మందికి పైగా ఆసుపత్రికి రోగులు రావడం జరుగుతుందని, వైద్యుడి తీరుతో రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ డాక్టర్‌ను బదిలీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీఇచ్చారు.



## చంద్రబాబూ.. కడపపై అంత కక్ష ఎందుకు?



వేంపల్లె, సెప్టెంబరు 29, ప్రభాతవార్త ః
కడప జిల్లాపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అంత కక్ష ఎందుకని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2023 డిసెంబరు 4న కేంద్ర ప్రభుత్వం కడప జిల్లాలో కొప్పర్తి పారిశ్రామికవాడలో రూ.250కోట్లతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. ఈ కేంద్రాన్ని కడప నుండి అమరావతికి తరలిస్తూ ఈ ఏడాది సెప్టెంబరు 24న చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం తగదన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని ఆయన అన్నారు. రాయలసీమ ప్రాంతం ముందుగానే వెనుకబడిందని, ఈ శిక్షణ కేంద్రం ద్వారా నిరుద్యోగులు ఉన్నత శిక్షణ పొంది ఉద్యోగాలు పొందే అవకాశం కోల్పోయారన్నారు. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు ఈ ఏడాది విద్యా సంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ మెడికల్ కమీషన్ ఈ ఏడాది ఆగస్టు 16న అనుమతి పత్రం ఇచ్చిందన్నారు. ఈ సీట్లు మాకొద్దు.. కళాశాలను నిర్వహించలేమని చంద్రబాబు ప్రభుత్వం నేషనల్ మెడికల్ కాలేజికి లేఖరాయడంతో ఎన్ఎంసీ ఇచ్చిన అనుమతి పత్రాన్ని ఉపసంహరించుకుందన్నారు. ఇంతకంటే దారుణం మరొకటి ఉండదన్నారు. అలాగే చంద్రబాబు ప్రభుత్వంలోనూ కడప జిల్లాకు ప్రాతినిథ్యం లేకపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడ నుండి అమరావతికి తరలించే జీవోను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు టీడీపీ కూటమిని చిత్తుచిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెబుతారని తులసిరెడ్డి అన్నారు.

## వైద్యశాఖమంత్రికి పులివెందులలో ఘన స్వాగతం



పులివెందుల రూరల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త ః
మొట్టమొదటిసారిగా పులివెందులకు విచ్చేసిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పులివెందులలో నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజి పరిస్థితులను ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వివరించారు. ఇక్కడ అందిస్తున్న వైద్యసేవలను, మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగు పరిచి ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని మంత్రిని ఎమ్మెల్సీ కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ తన దృష్టికి వచ్చిన సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## అన్నక్యాంటిన్‌కు రూ.60వేలు విరాళం



పులివెందుల రూరల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త ః
పులివెందులలోని అన్నక్యాంటిన్‌కు పులివెందుల గుడ్‌మార్నింగ్ బ్యాచ్ రూ.60వేలు విరాళం ఇచ్చారు. ఆదివారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి స్వగృహానికి వారు వెళ్లి ఈ మొత్తాన్ని ఎమ్మెల్సీకి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నక్యాంటిన్‌కు రూ.60వేలు విరాళం ఇవ్వడం ఆదర్శనీయమని తెలిపారు. విరాళాలు ఇచ్చేందుకు మరింత మంది ముందుకు రావాలని కోరారు. పేదల ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నక్యాంటిన్లు ఏర్పాటు చేశారని, ఆ సంకల్పానికి మీవంతుగా విరాళాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

## మంత్రికి గజమాలతో స్వాగతం పలికిన దేరంగుల జగదీష్

యర్రగుంట్ల, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేష్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తొలిసారిగా ప్రొద్దుటూరు పర్యటనలో భాగంగా ఆదివారం యర్రగుంట్ల పట్టణంలోని నియోజకవర్గ జనసేన పార్టీ కోఆర్డినేటర్ దేరంగుల జగదీష్ కూటమి సభ్యులతో కలిసి గజమాలతో ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని 4రోడ్ల కూడలి అల్లసాని పెద్దన విగ్రహంకి పూల మాల వేసి సత్కరించి ప్రొద్దుటూరుకి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాయలసీమ ఎస్సి మోర్చా నాయకులు నాగరాజు, జనసేన నాయకులు వైఎం ప్రసాద్, ప్రతాప్ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటుకు సన్నాహాలు



వేంపల్లె, సెప్టెంబరు 29, ప్రభాతవార్త ః
మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏరాప్టఉకు సన్నాహాలు చేస్తున్నట్లు వేంపల్లె శాఖ ఛైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీచైతన్య పాఠశాలలో మాసాంతర సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 20న ఉచితంగా మెడికల్ క్యాంపు ద్వారా పేద, సామాన్య ప్రజలకు సేవలందించేందుకు సభ్యులతో చర్చించామన్నారు. అలాగే సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించి, మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ, ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భవిష్యత్తులో మానవత ద్వారా వివిధ సేవలతో పాటు సమాజంలోని నిస్సహాయులకు అండగా నిలుస్తామన్నారు. మానవత చేపట్టే కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై సభ్యత్వ నమోదు చేయాలన్నారు. అంతేకాకుండా మానవత ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చి చేయూత అందించాలని కోరారు. ఈ సమావేశంలో మానవత డైరెక్టర్లు డాక్టర్ రాజారాం, డాక్టర్ రంగయ్య, రీజనల్ ఛైర్మన్ బాలాజి, అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ యోగేశ్వర్ బాబు, కోశాధికారి శ్రీకళ, తదితరులు పాల్గొన్నారు.

## 100 రోజుల పరిపాలనను ప్రజలు ఛీ కొడుతున్నారు

- ప్రజలను మభ్యపెట్టేందుకే లడ్డూ వ్యవహారం, వైఎస్ కుటుంబంపై అభాండాలు
- రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్ కుటుంబంపై తూగుట్ల మధు ఆరోపణలు



పులివెందుల, సెప్టెంబరు 29, ప్రభాతవార్త ః
రాష్ట్రంలో టీడీపీ 100 రోజుల పాలన అట్టర్‌ప్లాప్ అవడంతో టీడీపీ నాయకులకు మతి భ్రమించడంతో వైఎస్ కుటుంబ సభ్యులను ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్‌బాషాలు అన్నారు. ఆదివారం వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో వారు విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ తూగుట్ల మధుసూధన్‌రెడ్డికి వైఎస్ కుటుంబీకులే రాజకీయ భిక్ష పెట్టారన్నారు. అలాంటి వైఎస్ కుటుంబంపై ఆయన ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ మనోహర్‌రెడ్డి కుమారుల వివాహాలకు తూగుట్ల మధు వచ్చే ఉంటారని, వారి వివాహాలు హిందూ సాంప్రదాయ పద్ధతిలో మూడు రోజులు జరిగాయని పులివెందుల పట్టణ ప్రజలందరికీ తెలుసిన విషయమే అన్నారు. వారి మనుమళ్ల పుట్టువెంట్రుకలు కూడా తిరుమలలోనే వెంకటేశ్వరస్వామికి అర్పించారన్నారు. ప్రతి సంవత్సరం తిరుమల దర్శనానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా మతం మానవత్వం అని చెప్పాడం మీరు వినలేదా అని వారు ప్రశ్నించారు. వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డిల గురించి మాకంటే నీకే ఎక్కువ తెలుసునని వారన్నారు. చంద్రబాబునాయుడు మతాలను వాడుకోవడం లేదని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. 100రోజుల పాలన గురించి రాష్ట్ర ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారని, ఈ 100రోజుల అట్టర్‌ప్లాప్ పాలనను కప్పి పుచ్చుకునేందుకే తిరుమల లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారన్నారు. లడ్డూలో కలిపే నెయ్యి కల్తీ ఉన్నట్లైతే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ట్యాంకర్లను వెనక్కి పంపించడం తెలియదా అని వారు ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో టీడీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. చేతనైతే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసే విధంగా చూడాలన్నారు. అంతేకాని లేనిపోని అభాండాలను వైఎస్ కుటుంబీకుల మీద వేస్తే సహించేది లేదన్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకుని ప్రజలకు మంచి చేసే పనులు చేయాలని వారు హితవు పలికారు.

## మంత్రి సత్యకుమార్‌కు ఘన సన్మానం

ముద్దనూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:
రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ జిల్లా పర్యటణలో భాగంగా ఆదివారం నాడు ప్రొద్దుటూరులో రాయల్ కౌంటిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ముద్దనూరు మండలానికి చెందిన గిరిబోయిన సుధాకర్ యాదవ్ యాదవ సోదరులతో కలిసివెళ్లి ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని యాదవ సమస్యల గురించి మంత్రికు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందిచి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండలంలోని యాదవ సోదరులు పాల్గొన్నారు.



## ప్రవక్త జీవితంపై వ్యాసరచన పోటీలు



ముద్దనూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:
ముద్దనూరు పట్టణంలోని సంగమహేశ్వర హైస్కూల్ నందు ఆదివారం నాడు కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై కాంపిటీటీవ్ ఎగ్జామ్ నిర్వహించడం జరిగింది. ఈ పరీక్ష ఇంగ్లీష్ మరియు తెలుగు, ఉర్దూ భాషలలో నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షలో సీనియర్ గ్రూప్ జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి మొదటి బహుమతి 12వేలు, రెండో బహుమతి 6వేలు, మూడో బహుమతి 3000, అలాగే జూనియర్ గ్రూప్ నందు జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి మొదటి బహుమతి 6వేలు, రెండో బహుమతి 4వేలు, మూడో బహుమతి 2వేలు అందజేస్తామని వారు తెలిపారు. ఈ కాంపిటీటివ్ పరీక్షలకు 45 మంది విద్యార్థులు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మరియు ముద్దనూరు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

దువ్వూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరుకు సమీపంలో ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద కడప-కర్నూల్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంకిరెడ్డి శ్రావ్య (19) అనే యువతీ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలం నల్లపురెడ్డి పల్లె గ్రామానికి చెందిన శ్రావ్య, పెద్ద నాయన నారాయణ రెడ్డిలు దువ్వూరు మండలంలోని ఎంకుపల్లె గ్రామానికి వెళ్లి అక్కడ పని చూసుకొని తిరిగి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద లారీ ఢీ కొంది, దీంతో శ్రావ్య, నారాయణరెడ్డిలకు గాయాలు అయ్యాయి. వీరిద్దరిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విశమించడంతో శ్రావ్య మరణించింది. ఈ మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

## బొమ్మవరం పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం బొమ్మవరం గ్రామ పంచాయతీ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని టీడీపీ నాయకులు గడ్డం చానల్ రాజు తెలిపారు. ఇటీవల గ్రామంలో విద్యుత్తు, తాగునీటి సమస్య లేకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అదే విధంగా రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి ఆయన తనయుడు సాయి వికాస్‌రెడ్డి సహాయ సహకారాలతో వారి ఆదేశాల మేరకు గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ గ్రామంలో ప్రజా సమస్యలు ఎప్పుడు అప్పుడు పరిష్కారం మార్గాలు చూపుతూ విద్యా వైద్యం విద్యుత్తు తాగునీరు గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు వివిధ రకాలు అభివృద్ధి పనులు చేపట్టి పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దామన్నారు. ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి సినిమాల మల్లికార్జునరెడ్డి సహాయ సహకారాలు ఎల్లవేళలా మండల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ ఉండడంతో అంచెలంచెలుగా గ్రామాల అభివృద్ధి జరుగుతూనే ఉంది. ముందు ముందు ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టి పల్లెటూర్లను పట్టుకొమ్మల్లా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ రైతు సంక్షేమానికి సూచనలు, సలహాలు ఇస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా సహకరించాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో భీమవరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిందారోపణలు చేయడం తగదు

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:



ప్రభుత్వంపై ఇష్టానుసారంగా నిందారోపణలు చేయడం తగదని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ ఖండించారు. కడపలో వైసీజీ జిల్లా అధ్యక్షుడు కూటమి ప్రభుత్వం అడిగిన ప్రశ్నలకు అడ్డగోలుగా మాట్లాడడం వైకాపా నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. గత ఐదు సంవత్సరాలు డైవర్షన్ పాలిటిక్స్ ఎవరు చేశారోప ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. మాంసాహారుల చెమటలో గుర్గంధం ఉంటుందని అర్థరహితంగా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తే మంచిది. లేకుంటే వైకాపాను ప్రజలే నామరూపాలు లేకుండా చేస్తారన్నారు.

## ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు పట్టివేత

### - కేసులు నమోదు చేసిన మండల ఎస్సై చిరంజీవి

సిద్దవటం, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:



మండల పరిధిలోని దేగనవారిపల్లె పరివాహ ప్రాంతాల్లో శనివారం రాత్రి అక్రమ ఇసుక రవాణా చేస్తున్నట్లు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతానికి మండల ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో పెన్నానది పరివాహ ప్రాంతాల్లో తనిఖీలు చేయగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 4 ఇసుక ట్రాక్టర్లను సంబంధిత డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణా చట్ట రిత్యా నేరమని ప్రభుత్వ అనుమతి లేనిదే రవాణా చేయడం తగదని హెచ్చరించారు.

## మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో అన్న ప్రసాదాలు



సిద్దవటం, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేటలో ఆదివారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో భాగంగా కూల్‌డ్రింక్ షాప్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో దాదాపు 500 మందికి అన్న ప్రసాదం సమకూర్చారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నేత గౌస్‌బాషా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమాలు మా కుటుంబం తరుపున జరుపుతున్నామని మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకరమని ప్రతి ఒక్కరికి అల్లా అనుగ్రహం ఉండాలని గ్రామంలో హిందూ ముస్లిం సోదరులు ఐకమత్యంతో స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇది మంచి ప్రభుత్వంకు స్పందన



తంబళ్లపల్లె, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:

మండలంలో కొనసాగుతున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నట్లు రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలోనే పెన్షన్ పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్నా క్యాంటీన్లు, మహిళలకు రూ.5లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్, దీపావళికి ఉచిత గ్యాస్ పంపిణీ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అంటించి ప్రభుత్వ అభివృద్ధి పథకాల కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోళ్లఫారం శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కార్యదర్శి అప్పిరెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## కోసువారిపల్లెలో రైతులకు ఉలవల పంపిణీ



తంబళ్లపల్లె, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:

మండలం కోసువారిపల్లెలోని రైతులకు మండల తెదేపా అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, రాష్ట్ర టీడీపీ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, మహిళా నాయకురాలు సిద్దమ్మలు ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో వంద రోజుల పాలనలోనే ఘననీయమైన అభివృద్ధి, సంక్షేమం జరుగుతున్నట్లు చెప్పారు. మండలంలో ఏ గడపకు వెళ్లినా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు చెప్పారు. రైతులు తమ బీడు భూముల్లో ఉలవ పంట వేసుకొని లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్, ఆదిరెడ్డి, శివరాం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## రూ.5లక్షలు సిఎం సహాయనిధి పంపిణీ

మదనపల్లె, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధిత కుటుంబసభ్యులకు ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తనయుడు జువైద్ అక్బరీ చేతుల మీదుగా రూ.5 లక్షల సిఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. పట్టణంలోని బాలాజి నగర్‌కు చెందిన చాంద్‌బాషా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగుళూరు రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. ఆర్థికసాయంగా ఎమ్మెల్యేను వారు సంప్రదించగా తనవంతు సాయం ఎమ్మెల్యేగా సిఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేయించారు. ఈ చెక్కును ఆదివారం ఎమ్మెల్యే తనయుడు అందజేశాడు. సిఎం సహాయనిధి రావడం పట్ల చాంద్‌బాషా కుటుంబసభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కును అందజేస్తున్న దృశ్యం

## బ్యాంకు రుణలను సకాలంలో చెల్లించండి

### అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి

మదనపల్లె, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బ్యాంకు ఖాతాదారులు తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్దికి సహకరించాలని సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి, సిఈఓ పివి.ప్రసాద్‌లు తెలిపారు. ఆదివారం ది మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు 100వ వార్షికోత్సవ మహాజనసభ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అసిస్టెంట్ రిజిస్ట్రార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఈఓ పివి.ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు డిపాజిట్లు ఈ ఆర్థిక సంవత్సరం అంతం నాటికి రూ.90,84కోట్లు కలదన్నారు. అదే విధంగా బ్యాంకు ఇచ్చిన రుణం రూ.58.86కోట్లు అన్నారు. కాగా బ్యాంకు యొక్క వ్యాపార ధనం రూ.111.31కోట్లు ఉన్నదన్నారు. బ్యాంకు రూ.2.5లక్షల కోట్లు స్థూలలాభం పొంది రూ.52లక్షలు ఇన్‌కంట్యాక్స్ చెల్లించి రూ.1.53కోట్లు నికర లాభం సంపాదించిందన్నారు. రిజర్వ్‌బ్యాంకు నిబంధనల ప్రకారం బ్యాంకు లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే బ్యాంకు పాలకవర్గం ఏర్పడిన తరువాత బ్యాంకు శతవార్షికోత్సవ ఉత్సవాలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో బ్యాంకు ఆడిటర్లు కెఎస్ఎస్.ప్రసాద్, పిఎస్.చైతన్య, బ్యాంకు మేనేజర్లు సుధారాణి, జయచంద్రనాయుడు, రవిచంద్రారెడ్డి, రాధిక, రాజశేఖర్, బ్యాంకు సిబ్బంది, మాజీ డైరెక్టర్లు పసుపుపొడిరవి, ఎస్ఎ.రియాజ్, సోమశేఖర్, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మదనపల్లెకు అశోక-అంబేద్కర్ ధమ్మయాత్ర

మదనపల్లె, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :

దేశ ప్రజల మధ్య శాంతి, సహోదరత్వం కాంక్షిస్తూ కేరళాలోని బుద్ధభూమి నుంచి మహారాష్ట్రలోని దీక్షా భూమి వరకు నిర్వహిస్తున్న అశోక-అంబేద్కర్ ధమ్మయాత్ర మదనపల్లెలో నిర్వహించనున్నట్లు పౌండర్ ట్రస్టీ ఉపాసక పిటి ఎం శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం శాంతి సహోదరత్వం ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీ ఆర్టీసి బస్టాండు సమీపంలోని డాక్టర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉదయం 11గంటలకు ప్రారంభమై బెంగుళూరు రోడ్డులోని న్యూ అంబేద్కర్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం కర్నాటక రాష్ట్రంలోకి ప్రవేశిస్తుందన్నారు. బుద్దిస్టు ప్రెటర్నటిన కౌన్సిల్ నేషనల్ ధమ్మయాత్ర కమిటీలతో కలసి ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీలో అశోక-అంబేద్కర్ అభిమానులు, బౌద్ధాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## పంట రక్షణకు విద్యుత్‌తీగలను ఏర్పాటు చేస్తే చర్యలు

కురబలకోట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:



ట్రాన్స్‌కో ఏఈ శంకరరెడ్డి

పంటల రక్షణకోసం రైతులు విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని కురబలకోట మండల ట్రాన్స్‌కో ఏఈ శంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు, కొండ ప్రాంతాల్లో పంటలు వేసిన రైతులు అడవు జంతువుల భారి నుంచి కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే పరిస్థితులు తలెత్తుతాయని ఆయన తెలిపారు. పంట రక్షణ కోసం రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కరెంటు సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెస్తే సత్వరం పరిష్కరించుకునేందుకు చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి ట్రాన్స్‌కోకు సహకరించాలని ప్రజలను కోరారు.

## పిడుగుపడి రెండు ఆవులు మృతి

రామసముద్రం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :



మృతి చెందిన ఆవులు

మండలంలోని ఆర్ నడింపల్లి గ్రామ పంచాయితీ దిగువబొయపల్లె గ్రామానికి చెందిన రైతు సుబ్రమణ్యంకు చెందిన రెండు పాడి ఆవులు పిడుగుపాటుకు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న టైర్ల ఫ్యాక్టరీ సమీపంలో రేకులషెడ్లులో శనివారం కట్టేశారు. ఆదివారం వేకువజామున పడిన పిడుగుపాటుకు రెండు పాడిఆవులు మృతి చెందాయి. రెండు ఆవులు కలిసి దాదాపు రూ.1.40లక్షలు విలువచేస్తాయని పాడిరైతు తెలిపారు. ప్రభుత్వం ఈ రైతును ఆదుకోవాలని బాధితులు కోరారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

### ఛైర్మెన్ రమణారెడ్డి

కురబలకోట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :

విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని జీవిఐసి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మెన్ ఎన్‌వి.రమణారెడ్డి అన్నారు. ఆదివారం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రెసెర్స్‌డేను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక విజ్ఞానానికి సంబంధించిన పరిశోధనలకు అనేక అంశాలలో ఆవిష్కరణ ద్వారా ఎదగాలన్నారు. మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఉపాధ్యాయులు, సాంకేతిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనపరచిన వారికి ట్రోఫి మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణస్వామినాయక్, హెచ్ఓడి తదితరులు పాల్గొన్నారు.

### పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి

## మున్సిపల్ అభివృద్ధికి సహకరించండి

బద్వేలుఅర్బన్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :



మున్సిపాలిటీ పరిధిలో పేరుకుపోయి ఉన్న పలు ఇంటి పన్నులు, నీటిపన్నుల బకాయిలను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. ఇందుకోసం ప్రతి సచివాలయం నందు కౌంటర్‌లో పన్ను బకాయిలను చెల్లించేందుకు తగు ఏర్పాట్లు చేశామని దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నీటిని వృధా చేయకుండా కుళాయి కనెక్షన్‌ను ఇంటిలోపలికి గాని, ఇంటిఆవరణలోని తీసుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. అనుమతిలేని కుళాయిల కనెక్షన్‌లు ఉన్నట్లు తమ దృష్టికి వస్తే అలాంటి కనెక్షన్‌ను తొలగించడంతోపాటు ఇందుకు పాల్పడిన వారికి జరిమానా విధిస్తామన్నారు.

## దసరా కానుకగా వస్త్రాలు వితరణ

బద్వేలుఅర్బన్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :

ఆవోపా కమిటి ఆధ్వర్యంలో ముందస్తు దసరా కానుకగా శ్రీ శివ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో యజమాని తులసి వెంట శివనారాయణ, ఆయన సతీమణి ఇందుమతి, కుమార్తెలు లక్ష్మి లహరిక, సాయి భావన కుటుంబ సభ్యుల సహకారంతో పలువురు నిరుపేద ఆర్యవైశ్యులకు పంచలు, టవళ్లు చొక్కాలు, చీరలను అందజేయడం జరిగింది. ఆదివారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో ఆవోపా కమిఇ అధ్యక్షులు నూకల రెడ్డెయ్య, సెక్రటరీ నాగేశ్వరరావు, ట్రెజరర్ సుబ్రమణ్యం, స్టేట్ రీజనల్ వైస్ ప్రెసిడెంట్ చప్పరపు సుబ్బారావు, ఆవోపా మహిళా విభాగ్ అధ్యక్షురాలు సముద్రాల మాధవిలత, సెక్రటరీ పెసల శ్రీవాణితోపాటు పలువురు కమిటి సభ్యుల చేతుల మీదుగా అందించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.300లు వంతున పెన్షన్‌ను అందజేశారు. అలాగే పరిటాల కృష్ణయ్య కుమారుడు కేశవ సహకారంతో అల్పాహారం ఏర్పాటు చేశారు.



## విద్యుత్ పోల్‌ను ఢీకొన్న స్కూటరిస్టు - పరిస్థితి విషమం

గాలివీడు, సెప్టెంబర్ 29(ప్రభాతవార్త):



విద్యుత్ పోల్‌ను ఢీకొని ద్విచక్రవాహన దారుడు దేరంగుల పాలకొండ్రాయుడు(45) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు వీరబల్లి మండలం మట్లి గ్రామానికి చెందిన పాలకొండ్రాయుడు ఆదివారం ద్విచక్రవాహనంపై గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో కరిమిరెడ్డిగారిపల్లె వద్దకు రాగానే సబ్‌స్టేషన్ దగ్గర బైక్ అదుపు తప్పి ఎదురుగా విద్యుత్ పోల్‌ను ఢీకొనడంతో తలకు బలమైన గాయం కారనంగా తలపై, చెవిలో రక్తస్రావం జరిగినట్లుగా గుర్తించామన్నారు. గాయపడ్డ వ్యక్తి జేబులో ఉన్న ఓటరు కార్డు ఆధారంగా వివరాలు గుర్తించి వెంటనే 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లుగా సమాచారం.

## మాలల ధర్మయుద్ధం విజయవంతం చేయండి



ఛలో రాయచోటి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దశ్యం

పీలేరు, సెప్టెంబరు 29 ప్రభాతవార్తః

రాయచోటి ఎన్‌జీఓ హోమ్ నందు మాలల ధర్మ యుద్ధ సభను విజయవతం చేయాలని పీలేరు మాల మహానాడు మండల యూత్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీపురం నందు హాలో మాల ఛలో రాయచోటి కరపత్రాలు ఆవిష్కరించి మాలల ధర్మ యుద్ధం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధరణ్‌కుమార్, రాయలసీమ జిల్లాల కార్యదర్శి సుభాష్‌లు మాట్లాడుతూ దేశంలోని మెజారిటీ ప్రజలైన ఎస్సీ, ఎస్టీలను విభజించి వాఇని బలహీన పరిచే కుట్రలో భాగమే సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించి క్రిమిలేయర్ వర్తింపచేయాని తీర్పు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక తీర్పు అని ఆరోపించారు. ప్రతిగా ఎస్సీ వర్గీకరణకు ఎస్సీ,ఎస్టీల విషయంలో క్రిమిలేయర్ అమలుకు మాలలు మాలమహానాడు ఆధ్వర్యంలో జరుగు ధర్మ యుద్ధాన్ని వందలాదిమందితో అక్టోబర్ 6వ తేదీ రాయచోటిలోని జూనియర్ కళాశాల గ్రౌండ్ నందు ఎన్‌జీఓ హోమ్ వరకు ఊరేగింపు నిర్వహించి అనంతరం ఎస్సీ వర్గీకరణకు క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా సభ నిర్వహించబడునని ప్రజాస్వామ్య వాదులు అందరూ పాల్గొని ధర్మ యుద్ధ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మల్లికార్జున, గంగాధర్, రాజశేఖర్, విజయ్‌కుమార్, బాలాజీ, రెడ్డెప్ప, రవిచంద్ర, సరస్వతి, మంజుల, లక్ష్మీదేవి, వినయ్, వంశీ, లోహిత, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ అందుకున్న మహమ్మద్‌ఆలీ

పీలేరు, సెప్టెంబరు 29 ప్రభాతవార్తః



డాక్టరేట్ అందుకుంటున్న దృశ్యం

న్యూఢిల్లీలోని వెల్ ఎడ్యుకేషనల్ అండ్ పీస్ కౌన్సిల్ సంస్థ నుంచి మైనారిటీ నాయకులు షేక్ మహమ్మద్ అలీ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. న్యూఢిల్లీలోని కాన్సిట్యూషన్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన షేక్ మహమ్మద్ అలీ భారత నైపుణ్యాభివద్ది సంస్థ చైర్మన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. గత కొంతకాలంగా ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో మహమ్మద్ అలీ జాతీయ ఉక్కు వినియోగదారుల మండలి సభ్యులు గా కూడా సేవలందించారు. గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్న మహమ్మద్‌అలీని పీలేరు సర్పంచి డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అభినందించారు.

## సేవ, నాయకత్వ అభివద్దే జాతీయ వాసవిక్లబ్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వాసవిక్లబ్ జిల్లా అధికారులు

పీలేరు, సెప్టెంబరు 29 ప్రభాతవార్తః

సామాజిక సేవలు చేస్తూ ప్రజలతో మైత్రి, సహచరుల్లో నాయకత్వాన్ని పెంచడమే జాతీయ వాసవిక్లబ్ సెంటర్ లక్ష్యమని రీజియన్ ఛైర్‌పర్సన్ పామిడి జయచంద్ర అన్నారు. ఆదివారం వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ రికాన్ పామిడి ఉషా జయచంద్ర ఆధ్యక్షతన ఆదివారం శ్రీఆర్యవైశ్య కళ్యాణమండపంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ వి211 ఏ రీజియన్-1లోని పీలేరు వాసవి గ్రేటర్, పీలేరు వాసవికపుల్స్‌క్లబ్, కల్లూరు వాసవిక్లబ్, చిన్నగొట్టిగల్లు వాసవి ఫ్యామిలీస్, మదనపల్లె వాసవిక్లబ్ గ్రేటర్, మదనపల్లె వాసవి క్లబ్ వనితక్లబ్, బి.కొత్తకోట వాసవి వనితక్లబ్, బి.కొత్తకోట వాసవిక్లబ్ మొత్తం 8 క్లబ్‌లు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అంటేనే ప్రతి ఒక్కరికి సేవా కార్యక్రమాలు గుర్తుకొస్తాయని, సేవతో పాటు ఫెలోషిప్, లీడర్‌షిప్, కూడా పెంపొందించుకుంటూ ముందుకు వెళ్లడమే జాతీయ వాసవి క్లబ్ సెంటర్ నేషనల్ యొక్క లక్ష్యమన్నారు. తాము చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా పీలేరు ఆర్టీసీ బస్టాండులో అమ్మకు గౌరవం పేరుతో తల్లి పాలు ఇచ్చుగది ఏర్పాటుచేయడం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాగ్దేవి విద్యాగణపతి మందిరాన్ని ఏర్పాటుచేయడం, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో, కోర్టు ఆవరణలో, పట్టణ నాలుగురోడ్ల కూడలిలో సిమెంటు బల్లలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఉచిత కంటి శస్త్ర చికిత్సలు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. పీలేరులో 20 మంది క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని వారికి ఆరు నెలలు పాటు పౌష్టికాహారం అందించామన్నారు. చిన్నగొట్టిగల్లు, కల్లూరు, మదనపల్లెలో బి.కొత్తకోటలలో ఎన్నో సేవా కార్యక్రమాలు, జిల్లా స్థాయిలో సేవల్లో రీజియన్-1 ముందు ఉందన్నారు. రీజియన్ లో తాను ఛైర్‌పర్సన్‌గా ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పైసాని వెంకట శేషపాణి, ప్రోగ్రామ్ అబ్జర్వర్ నగేష్, రాచపల్లి బాలాజీ, చింతలూరి సురేష్, జిల్లా అధికారులు భరత్, సకలహరి, తులసి, కేసర్ల చెంగయ్య, జోన్ ఛైర్‌పర్సన్ జూటూరు అరవింద్‌బాబు, నరేంద్రకుమార్, ఐఈసీ అధికారి తేజ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు బలసావేణు, రేవూరి సుధీర్, బాలసుబ్రమణ్యం, మల్లికార్జున గుప్తా, మహిళామండలి ప్రెసిడెంట్ పామిడి మహాలక్ష్మీ సభ్యులు పాల్గొన్నారు.

## ముండ్లవాండ్ల కోటలో మంచినీటి సమస్య పరిష్కారం

చిన్నమండెం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :

రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితారెడ్డి చొరవతో చిన్నమండెం మండలం కేశాపురం గ్రామం ముల్లోళ్లకోటలో గ్రామస్తుల కోరిక మేరకు మంచినీటి సమస్యను శనివారం ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పరిష్కరించాఆరరు. ఈ గ్రామంలో గత కొంతకాలంగా మంచినీటి సమస్య ఏర్పడి నీటి సమస్యతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను గ్రామస్తులు హరితమ్మ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ఈ విషమం మంత్రికి తెలపడంతో మంత్రి ఆదేశంతో ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి దగ్గరుండి బోరు వేయించారు. అందులో పుష్కలంగా నీరు పడడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఎంతో కాలంగా వున్న నీటి సమస్య తీరడంతో వారు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అందరి శ్రేయస్సే ముక్కా కుటుంబ లక్ష్యం



రైల్వేకోడూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని ఐదు మండలాల అభివృద్ధి అందరి ఆశయంగా ముక్కా కుటుంబం పనిచేస్తుందని టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి అన్నారు. ఆదివారం రాఘవరాజుపురం టిడిపి కార్యాలయం నందు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలల్లో విజయదొందిబి మోగించామని అదే విధంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలలో అభివృద్దిని రానున్న రోజుల్లో చేస్తామని ఆమె అన్నారు. ముఖ్యంగా తమ కుటుంబం అభివృద్దికి పెద్దపీట వేస్తుందని తాము మాటల చెప్పే కుటుంబం కాదని కేవలం పనిచేస్తామని అన్నారు. గత ప్రభుత్వం కంటే ఉమ్మడి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని అనిపించేలా నియోజకవర్గంలోని ప్రజల చేత అనిపించుకుంటామన్నారు. నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. పార్టీలకు అతీతంగా అధికారులు పనిచేసి మంచి ప్రభుత్వానికి పేరు తేవాలని ఆమె ఆకాంక్షించారు. ఇప్పటికే ఇటీవల ఐదు మండలాలలో నిర్వహించిన మంచి ప్రభుత్వానికి విశేష స్పందన లభించిందని అక్కడ వచ్చిన అర్జీలను వేగవంతంగా పూర్తి చేసి ముక్కా కుటుంబానికి మంచి పేరు తెచ్చుకునేందుకు తమ కుటుంబం ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ముక్కా వరలక్ష్మి ఆశా భావాన్ని వ్యక్తం చేశారు.

## అనంతపురం గంగమ్మకు ఘనంగా బోనాలు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :



అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ అనంతపురం గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు వేకువ జామున నుండే మొక్కులు బోనాలు సమర్పించారు. ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుండి గంగమ్మ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని క్యూ లైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. వచ్చిన భక్తులకు ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారులు చెల్లు చంద్రశేఖర్ యాదవ్, పోలీసు శివ యాదవ్ భక్తులకు దర్శనాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నారాయణమ్మ, మార్కొండేయ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఇంటర్‌నేషనల్ ఉత్తమ ఉపాధ్యక్షుడిగా అవార్డు అందుకున్న శరత్ కుమార్ రాజు



రాజంపేట, సెప్టంబర్29, ప్రభాతవవార్త :

విజయవాడలోని గత శనివారం పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో వాకర్స్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షులు మురళీమోహన్ అధ్యక్షతన 159వ కౌన్సిల్ సమావేశం జరిగింది ఈ సమావేశంలో అన్నమయ్య జిల్లా రాజంపేట వాకర్స్ ఇంటర్ నేషనల్ ఉపాధ్యక్షుడు కొండూరు శరత్ కుమార్ రాజుకు ఉత్తమ ఉపాధ్యక్షుడిగా అవార్డు అందజేశారు. ఈ ఏడాది ఎప్రిల్‌లో ఈయన రాజంపేట వాకర్స్ ఇంటర్‌నేషనల్ మహాత్మాగాంధీ సభ్యత్వాన్ని ఒకేరోజు 109 మందిని చేర్చి సుమారు 11 లక్షల రూపాయలను అందజేశారు. ఈయన ఆధ్వర్యంలో ఒకేరోజు ఇంత సంఖ్యలో సభ్యత్వాన్ని నమోదు చేయడం ప్రపంచంలోనే మొదటి వ్యక్తిగా చరిత్రను నిలుపుకున్నారన్నారు. దీనికి గాను వాకర్స్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షుడు ఆయనకు వాకర్స్ ఇంటర్‌నేషనల్ ఉత్తమ ఉపాధ్యక్షుడు అవార్డు అందజేశారు. రాజంపేటకు చెందిన భారతీయ విద్యానికేతన్, శాన్వి ఇంటర్‌నేషనల్ అధినేతగా లయన్స్ క్లబ్, వాకర్స్ ఇంటర్‌నేషనల్ లు పలు సేవా సంస్థల్లో సేవలు అందించి కొండూరు శరత్ కుమార్ రాజు వాకర్స్ ఇంటర్‌నేషనల్ ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈయనను మాజీ అధ్యక్షులు చల్లికాని సీతారామయ్య, క్రిష్ణకుమారి, నాగభూషణం, సత్యనాథం, ప్రసాదు, శర్మాలతో పాటు 302కు చెందిన రవిరాజు సుధాకర్ రెడ్డి, మరియు సభ్యులు ఆయనను సన్మానించి సుభాభినందనలు తెలియజేశారు.

## టపాసుల గోడౌన్ ను తనిఖీ చేసిన రూరల్ సిఐ



వీరబల్లి, సెప్టంబర్29, ప్రభాతవవార్త :

మండలంలోని 3టపాసుల గోడౌన్‌లను ఆదివారం రూరల్ సిఐ వరప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టపాసుల గోడౌన్ స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం గోడౌన్ యజమానులతో మాట్లాడుతూ పరిమితి మేరకే స్టాక్‌ను ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు నడుచుకోవాలన్నారు. లేని ఎడల కఠినమైన చర్యలు తప్పవన్నారు.

## స్థల వివాదాన్ని పరిశీలించిన సీఐ



వీరబల్లి, సెప్టంబర్29, ప్రభాతవవార్త :

మండలంలోని సోమవరం పంచాయితీ కమ్మపల్లెలో ఏర్పడిన స్థల వివిదం పై ఆదివారం రూరల్ సిఐ వరప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ స్థలవివాదాన్ని స్థానిక తాహాశీల్దార్‌తో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. ఈ వివాదం పైన ఎవరైనా ఘర్షణ పడవద్దని ఇరు వర్గాలకు సూచించారు.

## ఇసుక ట్రాక్టర్ సీజ్ కేసు నమోదు

వీరబల్లి, సెప్టంబర్29, ప్రభాతవవార్త :

మండలంలోని ఒడివీడు పంచాయితీ కస్పాకు వద్ద ఆదివారం అక్రమంగా ఇసుక తోలుతున్న ట్రాక్టర్ ను స్థానిక సమాచారం మేరకు మండల యస్ఐ మోహన్ నాయక్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# లాయర్లకు, జడ్జీలకు మినహాయింపు లేదు

**( లోన్ రికవరీ అంశంపై కర్ణాటక హైకోర్టు సష్టీకరణ)**

**బద్వేల్ లీగల్, సెప్టంబర్29,ప్రభాతవవార్త :**
బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మొండి బకాయిలు వసూలు చేసుకునే విషయంలో సీనియర్ న్యాయవాదులకు, న్యాయమూర్తులకు ఎలాంటి ప్రత్యేక వెసులుబాటు ఉండబోదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది, ( ఎన్.రవీంద్రనాథ్ కామత్ వర్సెస్ సుబ్రమణ్యేశ్వర్ కోఆపరేటివ్ డబ్ల్యూసి నెం.3791 ఆఫ్ 2021 (జీయం-ఆర్ఇఎస్) వ్యాజ్యములో కర్ణాటక హై కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. తీసుకున్న అప్పుల చెల్లింపునకు సంబంధించి న్యాయవాదులకు గానీ, జడ్జీలకు గానీ, ప్రత్యేక మినహాయింపులేమి లేవని న్యాయమూర్తి కృష్ణ యస్.దీక్షిత్ ధర్మాసనం స్పష్టం చేసింది. రుణాలు పొందిన వారు న్యాయస్థానాల ఉత్తర్వులను గౌరవించి తిరిగి చెల్లించడం చాలా ముఖ్యమని న్యాయమూర్తి తేల్చి చెప్పారు. తమ నుంచి రుణ బకాయి వసూలు కోసం సరఫేసి చట్టం ( సెక్యులరైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫినాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ -2002) చట్టం క్రింద ఒక సహకా బ్యాంకు చేపట్టిన బలవంతపు చర్యలను నిలిపివేయాలంటూ ఓ సీనియర్ న్యాయవాది దాఖలు చేసిన పిటీసన్‌ను జస్టిస్ కృష్ణ ఎన్.దీక్షిత్ ధర్మాసనం తోసిపుచ్చింది. యం.రవీంద్రనాథ్ కామత్ అనే సినియర్ న్యాయవాధి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన 2017 ఫిబ్రవరిలో సుబ్రమణేశ్వర కోఆపరేటివ్ బ్యాంకు నుండి కోటిన్నర రూపాయలు అప్పు తీసుకొని నెలవారీ వాయిదాలలో రుణం చెల్లించుటకు అంగీకరించారు. కానీ బ్యాంకుకు ఇచ్చిన హామీలన్నింటినీ నిర్లక్ష్యం చేసి సకాలంలో రుణం చెల్లించలేదు. అప్పు తీరుస్తానంటూ పిటీషన్ కామత్ అనేక మార్లు బ్యాకుకు హామీలిచ్చినా వాటిని ఉల్లంఘించిన ఉదంతాలను కూడా న్యాయ స్థానం తన తీర్పులో గుర్తు చేసింది. దీంతో ఈ ఖాతాను మొండి బాకీగా బ్యాంకు 2017లో ప్రకటించగా సహకార బ్యాంకుల్లో మొండి బాకీల అంశంపై నరసింహ కమిటీ, మాధవరావు కమిటీ సిఫారసులను హైకోర్టు ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది.

# సగవాసిని కలిసిన మండల టీడీపీ నేతలు

**సిద్దవటం, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**



సిద్దవటం మండల తెదేపా నేతలు ఆదివారం రాజంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంను తన కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై ఆయనకు వివరించారు. మండల పరిధిలోని నూతన రేషన్ డీలర్ షాపులపై పలు సమస్యలపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తెదేపా నేతలు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గ కూటమి ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంను మండల పరిధిలో నూతన రేషన్ షాపు డీలర్ల సమస్యలు మరియు కొన్ని పల్లె ప్రాంతాల్లో వర్షాకాలంలో దెబ్బతిన్న రహదారుల సమస్యలపై ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మండల పరిధిలో ఉన్న కొంత మందిఅధికారులు అతి ఉత్సాహం చూపుతూ కొన్ని నిబంధనలు పాటించకుండా వాళ్ల ఇష్టానుసారం చేస్తున్న సమస్యలు లిఖితపూర్వకంగా తీసుకెళ్లామని మండల పరిధిలో ఇటీవల జరిగిన వీఆర్వోల బదిలీ అంశం ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా కార్యదర్శి నాగమునిరెడ్డి, మాజీ సర్పంచ్ రాజశేఖర్ యాదవ్, తెదేపా నేత చెంచయ్య నాయుడు, ఆసుపత్రి డెవలప్‌మెంట్ మాజీ కమిటీ సభ్యుడు మల్లు వెంకట సుబ్బారెడ్డి, అసెంబ్లీ కార్యనిర్వాహణ కార్యదర్శి రామ్మోహన్ నాయుడు, పార్ల శ్రీనివాసులు, జ్యోతి వెంకట సుబ్బారెడ్డి, అయ్యప్ప నాయుడు, నాగభూషణం, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**మదనపల్లె, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :**



సమావేశంలో పాల్గొన్న దృశ్యం

ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర ఆశా వర్కర్స్‌యూనియన్ జిల్లా ఇన్‌చార్జ్ గుంటి వేణుగోపాల్, రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్‌జిఓ హోమ్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి అధ్యక్షతన ఆశా వర్కర్ల సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 17ఏళ్ళుగా ఎలాంటి కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేకుండా గర్భవతులకు, బాలింతలకు సేవలు అందిస్తూ ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నార న్నారు. ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆశా వర్కర్లకు నెరవేర్చాలన్నారు. రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. సాధారణ సెలవులు, మెటర్నిటి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అలవెన్స్ బకాయిలను తక్షణం విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమ్మ, శ్రీనివాసులు, గంగాధర్, సరోజమ్మ, సుమిత్ర, కనకమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నాకయత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

**కురబలకోట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :**


విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న దృశ్యం

విద్యార్థులు ఎన్‌సిసిలో రాణించి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని చిత్తూరు ఆంధ్రా బెటాలియన్ ఏఓ లోకనాథ్, సుబేదార్ మేజర్ బిబి క్షత్రి అన్నారు. ఆదివారం మిట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఎన్‌సిసిలో ప్రతిభ కనపరచిన 29 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లును పంపిణీ చేశారు. ఇందులో ఏ సర్టిఫికెట్లు 28మందికి బి.సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సిసి కార్యకలాపాలు, నాయకత్వ లక్షణలపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని ప్రదరిస్తున్నట్లు తెలిపారు. బి.సర్టిఫికెట్లు అత్యంత విలువైనదని ఉన్నత విద్య, సాయుధళాల నియామకాల్లో ఇది దోహదపడుతుందని తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఈడి కీర్తినాదేళ్ళ అభినందించారు.

# పంగావాండ్లపల్లెలో పర్యటించిన కమిషనర్

**బద్వేలుఅర్బన్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :**



మున్సిపాలిటీ పరిధిలోని పంగావాండ్లపల్లె మరియు పంగావాండ్లపల్లె హరిజనవాడలను మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆదివారం తన సిబ్బందితో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు కమిషనర్ తాగునీరు, కాలువల అపరిశుభ్రత తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన కమిషనర్ ఆ సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఇంజనీరింగ్, ప్రజారోగ్యసిబ్బందికి సూచించారు.

# అంతర్జాతీయ జిల్లా పోటీలకు గ్యారంపల్లె విద్యార్థులు ఎంపిక

**కేవి.పల్లె, సెప్టెంబరు 29 ప్రభాతవార్తః**


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రెడ్డిబాషా

మండలంలోని గ్యారంపల్లె జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్‌జిల్లా పోటీలు గ్యారంపల్లె గురుకుల జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో హ్యాండ్ బాల్, త్రోబాల్, టెన్నికాయిట్, రబ్బీ గేములు సెలక్షన్స్ ఆదివారం నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలియజేశారు. ఈసెలక్షన్స్‌లో జిల్లా ఎస్జీఎఫ్ అండర్-19 జిల్లా సెక్రటరీ జయరామయ్య, ఎంఈఓ రెడ్డిబాషా, సర్పంచి రెడ్డెప్ప, మాజీ సర్పంచి వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నకేశవులు మాట్లాడుతూ విద్యార్థులకు గేమ్స్ చాలా ప్రధానమైనవని గేమ్స్,అండ్ స్పోర్ట్సు ఆడేవారికి చక్కటి శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం మెరుగై విద్యలో చక్కగా రాణిస్తారన్నారు. రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఎంఈఓ రెడ్డిబాషా మాట్లాడుతూ ఆటలలో రాణించిన విద్యార్తులకు ఉన్నత చదువులో రిజర్వేషన్ ఉంటుందని చెప్పారు. పై ఆటలలో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా స్పోర్ట్సు అధికారులు, కళాశాల సిబ్బంది రమాదేవి, కొండయ్య, షకీల్, అహ్మద్, నాగేంద్ర, నాగరాజానాయక్, అన్నపూర్ణ, సౌజన్య వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పురుషోత్తం, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# చైర్‌పర్సన్ విధినిర్వహణలో భాగంగా తనిఖీ





**బద్వేల్ లీగల్, సెప్టంబర్ 29, ప్రభాతవవార్త :**
ఆంధ్ర రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థాన అదేశానుసారం రాష్ట్ర న్యాయ సేవా ధికార సంస్థ ఆజ్ఞల మేరకు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనల అనుసరించి బద్వేలు న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వై.జె పద్మశ్రీ విధినిర్వహణలో భాగంగా బద్వేలు న్యాయస్థాన పరిధిలోని బి.సి,ఎస్సీ వసతిగృహాలు, బాలికల వసతిగృహాలు, చైల్డ్ కేర్ సెంటర్లు, వృద్ధాశ్రమాలు మొదలగు వాటిని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు వృద్దులను ఆప్యాయంగా పల కరించి స్థితిగతులు, ఉపాధ్యాయుల, సంరక్షకులు తీరు తెన్నులు, ఆహార ఏర్పాట్లు, నీటి వసతి, క్రమశిక్షణ, బోధన, ఆరోగ్య పరిరక్షణ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర మరియు సంరక్షకులు, వసతి గృహాల మరియు చైల్డ్ కేర్, వృద్ధాశ్రమాల సిబ్బంది యొక్క ప్రవర్తన తదితర అంశాల గురించి క్షుణ్ణంగాను, విడివిడిగాను అందరితో మాట్లాడి తగు సూచనలను సలహాలను అందజేసి ఇంకనూ అభివృద్దిపధాన నడువవలసిన వనరుల గురించి విశదీకరించడం జరిగింది. తనిఖీ చేసి ఈ సందర్భంగా ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు.

# తగ్గిన దిగుబడి - పెరిగిన ధరలు - టమోటా కిలో రూ.60

**మదనపల్లె, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :**


మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

టమోటాకు ఉన్నఫలంగా ధరలు గణనీయంగా పెరిగాయి. ఆదివారం మార్కెట్‌యార్డులో కిలో టమోటా రూ. 60లు అత్యధికంగా ధర పలికింది. ఒక్కసారిగా ధరలు పెరగడంతో టమోటా రైతులు ఆనందోత్సవాలు వ్యక్తం చేస్తున్నారు. పదకేజీల టమోటా మొదటిరకం రూ.580 నుంచి 600ల వరకు ధరలు పలికాయి. గతవారం రోజులుగా ధరలు మోస్తారుగా పెరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఒక్కసారిగా ధరలు పెరగడం వల్ల టమోటా రైతుల్లో ఎనలేని ఆనందం కలుగుతోంది. దిగుబడి తగ్గడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఇన్నాళ్ళు 300నుంచి 400మెట్రిక్ టన్నుల వరకు మార్కెట్‌కు టమోటాలు వచ్చేవి. ఆదివారం 114మెట్రిక్ టన్నులు మాత్రం టమోటాలు రావడం జరిగింది. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ పెరగడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. టమోటా వ్యాపార లావాదేవీలకు మదనపల్లె మార్కెట్‌యార్డు రాష్ట్రంలోనే పేరుపొందింది. ఇక్కడ నుంచి మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఒడిస్సా, తెలంగాణ, రాష్ట్రాలతో పాటు వివిధ పట్టణ ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. టమోటా ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

# వర్షం కోసం పాలేటమ్మకు బోనాలు

**చిన్నమండెం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :**



మండలంలోని కేశాపురం గ్రామం దేవళంపేట వద్ద మాండవ్య నది ఒడ్డున వెలసిన పాలేటమ్మకు ఆదివారం రెడ్డివారిపల్లెకు చెందిన ప్రజలు వర్షం కోసం సామూహికంగా బోనాలు సమర్పించారు. బ్యాండు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య మహిళలు బోనాలు తలపై పెట్టుకొని, పురుషులు పొట్టేళ్లను పట్టుకొని మెరువనిగా మూడు కిలో మీటర్లు నడిచి ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. అనంతరం పొట్టేళ్లను బలిచ్చారు. కరువుతో పశుక్షాదులకు తాగునీరు, మేత లేక, పెట్టిన పంటలు ఎండిపోయి అలమటిస్తున్నాం. వర్షం కురిపించమ్మా అంటూ మొక్కుకొన్నారు. అనంతరం గ్రామంలో స్నేహితులు, బంధువులతో కలిసి విందు బోనాలు వండుకొని ఆరగించారు. ప్రతి సంవత్సరం ఈ మాసంలో వీరు బోనాలు పట్టడం ఆనవాయితీగా వస్తోంది.

# సమాజసేవే మానవతా స్వచ్ఛంధ సేవ సంస్థ లక్ష్యం

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :**



సమాజసేవే లక్ష్యంగా మానతా స్వచ్ఛంధ సంస్థ కృషి చేస్తుందని మానవతా మండల అధ్యక్షులు ఎస్ఎండి షఫీ నాయక్ అన్నారు. ఆదివారం మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో మానవతా స్వచ్ఛంధ సేవ సంస్థ ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా అనేక మందికి గర్భవతులకు ప్రమాదంలో ఉన్న వారికి రక్తదానం చేస్తున్న పక్కీరయ్యకు వారు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 10000 మందికి పైగా సభ్యులు ఉన్నారని అన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావిస్తూ మహోన్నతమైన లక్ష్యంతో రామ చంద్రరెడ్డి స్థాపించిన మానవతా స్వచ్ఛంధ సేవ సంస్థ నేడు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే మరోవైపు సమాజానికి స్ఫూర్తి కలిగించే విధంగా వినూత్న కార్యక్రమాలను చేపట్టం జరుగుతుందని అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ బోధనతో పాటు పేదలకు ఉచిత వైద్య శిబిరాలు అందించడం జరుగుతుందని అన్నారు. కుల మతాలకు వర్గాలకు అతీతంగ ఉచిత మార్చురీ ఫ్రీజర్లు, ఉచిత శాంతి రథాలు అందిస్తున్నామని అన్నారు. అలాగే నిరుపేదలైన మహిళలకు దీర్ఘకాలిక రోగులకు ఆర్థికంగా వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు. మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్న దాతలకు అభినందనలు తెలిపారు. మండల మానవతా చైర్మన్ బాలసుబ్రమణ్యం, కేంద్ర కమిటీ సభ్యులు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శివయ్య, గోపాలు, గంగిరెడ్డి, నాగరాజు, బండపల్లి శ్రీనివాసులు గంగయ్య, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

# దాతల ఔదార్యంతో అక్కగార్ల గుడి నిర్మాణం

**కలికిరి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**



మండలంలోని పత్తేగడ పంచాయతీ కొటాల గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా నిర్మాణంలో లేని అక్కగార్ల గుడికి తమ గ్రామ పెద్దలైన వాసనూరి చంద్రశేఖర్, వాసనూరి చల్లయ్యల ఔదార్యంతో అమ్మవారికి ఆలయ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. గ్రామంలో గత 40 సంవత్సరాలుగా అక్కగార్ల గుడికి ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి శుక్రవారంతో పాటు గ్రామంలో ఏ శుభ కార్యం చేపట్టాలన్నా ప్రథమంగా గ్రామస్థులు, మహిళలు, అక్కగార్లకు పూజలు చేసి ఆ తరువాత శుభ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆ గుడికి చాలా సంవత్సరాలుగా ఆలయ నిర్మాణం లేకుండా ఉంది. దీంతో గ్రామ పెద్దలు గ్రామంలోని పెద్దల సహకారంతో తమ సొంత నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టి గత 40 రోజులుగా పూజలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారంతో 41 రోజులు పూర్తి కావడంతో అక్కగార్లకు, అమ్మవార్లకు పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. గ్రామంలోసని మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 41 రోజులు ధర్మకర్త కొటాల చల్లయ్య, ఆయన సతీమణి రేణుకలు ప్రత్యేక పూజలు చేశారు.

# టీడీపీ ఎస్సీ సెల్ నేత మందా శ్రీనుపై వైసీపీ వర్గీయుల దాడి

**పరామర్శించిన జగన్ రాజు**

**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:**



రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మందా శ్రీను పై వైసీపీ వర్గీయులు శనివారం రాత్రి దాడి చేశారు. రాజంపేట పట్టణం నారపురెడ్డి పల్లె అరుంధతీ వాడలో ఈ సంఘటన జరిగింది. దాడిలో గాయపడిన మందా శ్రీనును రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మందా శ్రీనును టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు పరామర్శించారు. మందా శ్రీనుకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. అనంతరం జగన్‌మోహన్ రాజు మీడియాతో మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలకు కుటుంబ సమస్యలను, భూ సమస్యలను సాకుగా చేసుకొని రాజకీయ దురుద్దేశంతో వైసీపీ వర్గాలు దాడులకు ప్రోత్సహించడం సహించం అని స్పష్టం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. జగన్ రాజు వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యం నాయుడు, పార్టీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రమణ్యం నాయుడు, సుబ్బరాయుడు, శేశారెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు శివకుమార్, ఇతర తెలుగుదేశం నేతలు పాల్గొన్నారు.

# డిస్క్‌త్రోలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి

**గాలివీడు, సెప్టెంబర్ 29(ప్రభాతవార్త):**



మండల కేంద్రంలోని గౌతమ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన అభిషేక్ ఉమ్మడి కడప జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి అండర్-17 విభాగంలో డిస్క్‌త్రో బాల్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మాన్యుల్, సైజుథామస్‌లు తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా పోటీలలో పాల్గొనే ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉండాలని, నిరంతర కృషితో లక్ష్యాన్ని సాధించేలా ఉండాలన్నారు. మండల స్థాయి నుండి జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలలో అవార్డులు తెచ్చుకోవాలని విద్యార్థులను కోరారు. అనంతరం అభిషేక్‌ను పాఠశాల పీఈటీ పవన్‌కుమార్‌నాయక్, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

# శాప్ ఛైర్మన్‌కు అభినందనలు



**గాలివీడు, సెప్టెంబర్ 29(ప్రభాతవార్త):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాథమిక సంస్థ ఛైర్మన్(శాప్) రవినాయుడును గాలివీడు మండలానికి చెందిన నారా లోకేష్ యువగళం పాదయాత్ర వాలంటీర్లు వెంకటరామిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, మురళీ, ఓబులేసు, కుమార్‌నాయుడు, హరి, రమణారెడ్డి, లక్ష్మీప్రసాద్, క్రాంతికుమార్, నాగార్జున తదితరులు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం వెనుకబడిన రాయచోటి ప్రాంతంలో ఉన్న యువతకు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడంలో సహకరించాలని ఈ సందర్భంగా కోరడం జరిగిందన్నారు.

## ప్రభుత్వ రేషన్ బియ్యం

# పేదలకు అందడంలో అనేక అక్రమాలు

**-ప్రశ్నించిన మైదుకూరు రేషన్ డీలర్లు**



**మైదుకూరు,సెప్టెంబర్ 29,ప్రభాతవార్త:**
ప్రభుత్వ రేషన్ బియ్యం పేదలకు అందడంలో అవినీతి అధికారికి లక్షల కాసులు కురిపించే ముడిసరుకు అయింది. అక్రమాలను కొత్త పుంతలు తొక్కిస్తూ నెలకు లక్షల రూపాయలు సంపాదిస్తుంది..! శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్టుగా ఉందట అవినీతి అధికారి తీరు. నిరుపేదల బియాన్ని అడ్డదారిలో బొకేస్తోంది. డీలర్లకు టేరు (తరుగు) ఇవ్వకుండా క్వింటాల్కు రెండు కిలోలు నొక్కేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు! ఫలితంగా డీలర్లకు తక్కువ బియ్యం అందుతుంది. నొక్కేసిన బియ్యాని వందల క్వింటాళ్ల నల్ల బజార్లో తరలిస్తూ లక్షల రూపాయలు కూడబెడుతుంది అన్న విమర్శలు డీలర్ ల నుండి గట్టిగా వినిపిస్తున్నాయి. సెప్టెంబర్ నెలలో 18 మూటల బియ్యం నల్ల బజారుకు తరలించినట్లు గుసగుసలు గప్పుమంటున్నాయి. మైదుకూరు ఎమ్.ఎల్.ఎస్ పాయింట్ పరిధిలో మైదుకూరు 48, దువ్వూరు 37 రేషన్ షాపులు ఉన్నాయి. డీలర్లు ఇండెంట్ మేరకు చౌక దుకాణాలకు బియ్యాన్ని రవాణా చేస్తారు. మైదుకూరు ఎమ్.ఎల్.ఎస్ అధికారి చేతివాటం ప్రదర్శిస్తూ ఉండడంతో ఆ ప్రభావం డీలర్ లపై అనంతరం కార్డుదారులపై పడుతున్నట్లు తెలుస్తోంది. మైదుకూరు పరిధిలోని 25,31,32,33,44,45, 10 షాపుల రేషన్ డీలర్లకు బియ్యాన్ని ఇంకా సప్లై చేయలేదు. వీరందరూ కూడా తమకు రావలసిన టెర్(తరుగు)ఇవ్వాలని నిలదీయడంతో తమకు ఇంకా బియ్యాన్ని సప్లైచేయలేదని వాపోతున్నారు. ఒక సంచి బియ్యం ప్యాకెట్ నుండి 700 గ్రాములు నుండి 1 కిలో వరకు తరుగు ఇవ్వాల్సి ఉండగా మైదుకూరు గోడౌన్ పాయింట్ అధికారి ఇవ్వడం లేదు అంటున్నారు డీలర్లు.

**ధర్నాకు సిద్ధమైన రేషన్ డీలర్లు...**

ప్రభుత్వం వచ్చిందని తమకు డీలర్ షిప్ వచ్చిందని సంతోషపడ్డ డీలర్లకు సంతోషం లేకుండా పోయింది. ఒకవైపు బ్యాక్లాగ్‌తో తలలు పట్టుకుంటున్న డీలర్లు.మరోవైపు టెర్(తరుగు)ఇవ్వకుండా తమ బియ్యాన్ని నొక్కేస్తూ నల్ల బజార్ తరలిస్తుండడంతో రేషన్ డీలర్లు తలలు కొటుకుంటున్నారు!. ఒక్కో డీలర్కు సగటు దాదాపుగా 150 నుంచి 200 మూటల బియ్యాన్ని దించుతారు. ఒక్కో మూటకు కేజీ చొప్పున తరుగు వేసుకున్న 150 కేజీల నుంచి 200 కేజీల బియ్యం తక్కువ వస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు.దీని పై డీలర్ల సంఘం అధ్యక్షుడు చొక్కం శివ ఆధ్వర్యంలో డీలర్ లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. టెర్ గట్టిగా అడిగితే ఆ డీలర్కు ఒక్క మూట దించకుండా అధికారి ప్రవర్తిస్తుందంటూ రేషన్ డీలర్ల మండిపడుతున్నారు.ఆదివారం ఎం ఎల్ ఎస్ పాయింట్ వద్ద ధర్నా చేసేందుకు సిద్ధమైనట్లు కొందరు డీలర్లు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారి తీరు మార్చుకొని డీలర్ లకు సక్రమంగా బియ్యాన్ని అందించేలా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

# నేడే రైతులకు ఉలవలు పంపిణీ

**కలికిరి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరఫరా చేసిన ఉలవలను సోమవారం ఉదయం 11 గంటలకు మర్రికుంటపల్లె పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఉలవలు పంపిణీ చేస్తారని వ్యవసాయాధికారిణి జీఆర్ మమతారెడ్డి అదే మర్రికుంటపల్లె పంచాయతీ అగ్రికల్చర్ అసిస్టెంట్ రోసన్ ఆరాలు తెలిపారు. మర్రికుంటపల్లె పంచాయతీకి 30 క్వింటాళ్లు మంజూరయ్యాయని, కావాల్సిన రైతుల పేర్లు నమోదు చేయడం జరిగిందన్నారు.


వార్త



రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

| అన్నమయ్య జిల్లా | కడప జిల్లా |
|---|---|
| వాయల్పాడు, | ప్రొద్దుటూరుక్రైం, |
| బి.కొత్తకోట, | ప్రొద్దుటూరు రూరల్, |
| మొలకలచెరువు | మైలవరం, |
| | మైదుకూరు రూరల్, |

మీ పూర్తి బయోడేటాతో 30వ తేది సోమవారం క్రింది చిరునామాలో సంప్రదించగలరు

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086